నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
13 | హైదరాబాద్, గురువారం 11 జనవరి 2024 | YADADRI BHUVANAGIRI

గొర్రెల పంపిణీ వెంటనే అమలు చేయాలి : దూదిమెట్ల

గొర్రెల పంపిణీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని తెలంగాణ గోట్స్ అండ్ షీప్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ డిమాండ్ చేశారు. గొర్రెల యూనిట్లు ఇవ్వాలని బుధవారం గొర్రె మేకల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో భువనగిరి పట్టణం నుంచి కలెక్టరేట్ వరకు ఒగ్గు డోలు చప్పుళ్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ ప్రధాన గేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆ తర్వాత కలెక్టర్ హన్మంతు జెండగేకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా దూదిమెట్ల బాలరాజ్ యాదవ్ మాట్లాడుతూ గొర్రెల యూనిట్లైనా ఇవ్వండి లేదా డీడీలకు కట్టిన పైసలైనా ఇవ్వండని డిమాండ్ చేశారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. వెంటనే గొర్రెలను పంపిణీ చేయకపోతే తమ తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అయోధ్య యాదవ్, సుక్కల సత్యనారాయణ, వెంకటేశ్ యాదవ్, జెల్లి నర్సింహులు, గుండెబోయిన వెంకటేశ్ యాదవ్, ర్యాకల శ్రీనివాస్, ముక్కర్ల సతీశ్, మహేందర్ కురుమ, రాసాల శేఖర్, రాంబాబు కురుమ, రమేశ్ యాదవ్ పాల్గొన్నారు.

గొర్రెలైనా ఇవ్వండి.. డీడీలైనా వాపస్ చేయండి

పథకం కొనసాగింపుపై గొల్లకురుమల్లో ఆందోళన

తొలి విడుతలో 18,655 యూనిట్లు ఇచ్చిన గత కేసీఆర్ సర్కారు

- జిల్లాలో రెండో విడుతలో 15,427 గొర్రెల యూనిట్లు మంజూరు
- సబ్సిడీ గొర్రెల కోసం డీడీలు కట్టిన లబ్ధిదారులు
- కొత్త ప్రభుత్వంలో స్కీమ్ అమలుపై నీలినీడలు
- భువనగిరిలో గొల్లకురుమల ర్యాలీ, కలెక్టర్‌కు వినతి
- గొర్రెల పథకాన్ని వెంటనే అమలు చేయాలి : దూదిమెట్ల

భువనగిరి కలెక్టరేట్ వద్ద గొల్ల కురుమలతో కలిసి నిరసన తెలుపుతున్న దూదిమెట్ల బాలరాజుయాదవ్

యాదాద్రి భువనగిరి, జనవరి 10 (నమస్తే తెలంగాణ) : 'గొర్రెలైనా ఇవ్వండి.. లేదా మేం కట్టిన డీడీలైనా వాపస్ చేయండి' అంటూ గొల్లకురుమలు డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గొర్రెల యూనిట్ల పథకం నిలిపివేడయంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు చోట్ల ఆందోళనలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. తొలి విడుతలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలో 18,655 యూనిట్లు పంపిణీ చేయగా, రెండో విడుతలో 15,427 గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. గొల్లకురుమల లబ్ధిదారులు డీడీలు కూడా చెల్లించారు. రెండో విడుతలో పంపిణీని ప్రారంభించి, 2790మందికి యూనిట్లు అందించింది. కానీ కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో పథకం కొనసాగింపుపై నీలినీడలు అలుముకున్నాయి. దాంతో గొర్రెల పంపిణీ కార్యక్రమం వెంటనే ప్రారంభించాలని కోరుతూ గొల్లకురుమలు బుధవారం భువనగిరి పట్టణం నుంచి కలెక్టరేట్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

గొల్ల కురుమలకు జీవనోపాధి కల్పించేందుకు 2017లో గత కేసీఆర్ సర్కార్ గొర్రెల పంపిణీ పథకాన్ని తీసుకొచ్చింది. దీని కింద సర్కారు 75శాతం సబ్సిడీ అందిస్తున్నది. స్కీమ్‌లో భాగంగా 20 గొర్రెలు, ఒక పొట్టేలు అందిస్తున్నారు. ఇప్పటికే మొదటి విడుతలో గొల్ల కురుమలకు యూనిట్లు పంపిణీ చేసింది.

పథకం అమలుపై నీలినీడలు

గత ఎన్నికల వరకు గొర్రెల పంపిణీ కార్యక్రమం సజావుగానే అమలైంది. ఇప్పుడు కొత్త ప్రభుత్వం రావడంతో పథకం అమలుపై నీలినీడలు అలుముకున్నాయి. సర్కారు తీరుపై గొల్ల కురుమలు ఆందోళన చెందుతున్నారు. తాము ప్రభుత్వానికి ఇప్పటికే డీడీ కట్టామని, 75శాతం సబ్సిడీపై గొర్రెలను పంపిణీ చేయాల్సిందేనని భీష్మించి కూర్చున్నారు. ఒక్కొక్కరు రూ. 43,750 చొప్పున ప్రభుత్వానికి చెల్లించారు.

సబ్సిడీ కోసం ముందుగా గొల్లకురుమలు డీడీ తీయాలి. ఒక్కో యూనిట్‌కు రూ. 1.25లక్షల ఖర్చుగా నిర్ణయించారు. ఇందులో మొదట లబ్ధిదారుడు తన వాటా కింద రూ. 31,250 చెల్లించేది. సర్కారు సైతం తన వాటా సబ్సిడీని రూ. 93,750 ఇచ్చేది. మొత్తంగా రూ. 1.25లక్షలతో 21 పిల్లలను పంపిణీ చేసింది. మొదటి విడుతలో జిల్లాలో 18,655 గొర్రెల యూనిట్లను 75శాతం సబ్సిడీపై పంపిణీ చేసింది. ఇందుకోసం రూ. 232 కోట్లను ఖర్చు చేసింది.

సీసీ సంతోశ్‌కుమార్‌పై కలెక్టర్ ఆగ్రహం

భువనగిరి కలెక్టరేట్, జనవరి 10 : మేకల పెంపకందారులకు గొర్రెలను పంపిణీ చేయాలని కోరుతూ బుధవారం కలెక్టర్ కార్యాలయానికి రాష్ట్ర షీప్స్ అండ్ గోట్స్ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్ వచ్చారు. ఈ క్రమంలో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించేందుకు కలెక్టర్ చాంబర్‌కు రావడంతో అక్కడే ఉన్న కలెక్టర్ సీసీ సంతోష్‌కుమార్ బాలరాజుయాదవ్‌తో అమర్యాదగా ప్రవర్తించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా కలెక్టర్ సీసీ సంతోష్‌కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు సమస్యలపై వచ్చే ప్రజలు, అర్జీదారులకు అసౌకర్యం కల్పించొద్దని హెచ్చరించారు.

15,427 యూనిట్లు మంజూరు..

గొర్రెల పథకంలో భాగంగా రెండో విడుతలో గతంలో గొర్రెల యూనిట్ల పంపిణీని ప్రారంభించింది. రెండో విడుతలో భాగంగా జిల్లాలో 15,427 యూనిట్లు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 3,23,967 గొర్రెలను పంచాలని నిర్ణయించింది. ఇందుకోసం అప్పటి ప్రభుత్వం రూ.203 కోట్లను ఖర్చు చేయాలని అనుకుంది. ఇందుకోసం బడ్జెట్ కూడా విడుదలైంది. ఎన్నికల ముందు వరకు 2,790యూనిట్లను పంపిణీ చేసింది. 75శాతం సబ్సిడీతో గొర్రెలు ఇవ్వడంతోపాటు బీమా సదుపాయం కూడా కల్పించింది. ధరలు పెరుగడంతో యూనిట్ ఖర్చు మరో 50వేలు పెంచి, మొత్తంగా రూ. 1.75లక్షలు చేసింది. పథకం ఉద్దేశం విజయంతంగా అమలు కావడంతో ఏటేటా గొర్రెల మంద పెరిగిపోతుండటంతో గొల్లకురుమల కుటుంబాలు మంచి ఆదాయం ఆర్జిస్తున్నాయి.

యాదగిరిగుట్టలో నిరాటోత్సవంలో భాగంగా మాడ వీధుల్లో లక్ష్మీనరసింహుడి ఊరేగింపు

గుట్టలో వైభవంగా నిరాటోత్సవం

యాదగిరిగుట్ట, జనవరి10 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గోదాదేవి(ఆండాళ్) అమ్మవారికి నిరాటోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ కల్యాణ మండపంలో అమ్మవారిని దివ్య మనోహరంగా అలంకరించి స్వామి, అమ్మవార్లను ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించి వేడుకలు జరిపారు. గోదాదేవికి మహిళా భక్తులు మంగళహారతులతో నీరాజనాలు పలికారు. స్వామి, అమ్మవారు మంగళస్నానం ఆచరిస్తారని, బోగి పండుగ సందర్భంగా గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ నిరాటోత్సవాలను జరుపుతామని ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌ధీఘిళ్ లక్ష్మీనరసింహాచార్యులు తెలిపారు. ఆలయ అర్చక బృందం, పారాయణికులు వేద మంత్రాలను పఠిస్తూ తిరుప్పావై పూజలు చేశారు. మొదటిరోజులో భాగంగా పారాయణికులు విశేష కూడారై పాశురాలను పఠించి, అమ్మవారికి పాయసం నివేదించారు. స్వామివారి దివ్యక్షేత్రంలో స్వయం భూమూర్తులకు నిత్యారాధనలు వైభవంగా సాగాయి. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నారసింహ స్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి వారికి నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్ర నామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. గంటన్నర పాటు అర్చక బృందం శాస్త్రోక్తంగా కల్యాణ తంతు జరిపారు. బుధవారం ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుసూ హోమం జరిపారు. స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. అనంతరం లక్ష్మీసమేతుడైన కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్ఠించి నిత్యకల్యాణ తంతును నిర్వహించారు. సాయంత్రం వేళ స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ వైభవంగా చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అన్ని విభాగాలను కలుపుకుని స్వామివారి ఖజానాకు రూ. 17,94,816 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



సమీక్ష సమావేశంలో సాగు నీటి కాల్వల పని తీరును పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, జనవరి 10 : లబ్ధిదారులకు సకాలంలో పథకాలు అమలయ్యేలా అధికారులు కృషి చేయాలని, ఆలేరు నియోజక వర్గ అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఆలేరు నియోజకవర్గానికి సంబంధించి సాగునీటి పథకాలపై జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కె.జెండగేతో కలిసి సమీక్ష నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టు బస్వాపూర్ రిజర్వాయర్, ప్యాకేజీ 14, 15, ప్యాకేజీ 16 కాల్వలు, బునాదిగాని కాల్వ పనుల పురోగతి, వాటికి సంబంధించిన భూసేకరణ వివరాలను నీటి పారుదల శాఖ, ఆర్‌బీ, పంచాయతీరాజ్ శాఖ, వైటీడీఏ అధికారులతో చర్చించారు. జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో నీటిపారుదల, చెరువులు, చెక్ డ్యామ్‌లు, రోడ్లు పనులకు సంబంధించి ప్రణాళికలు సమర్పించాలని, విద్యుత్ సబ్ స్టేషన్లకు కావాల్సిన స్థల సేకరణ రేపటిలోగా పూర్తి చేయాలని తాసీల్దార్లను ఆదేశించారు. బునాదిగాని కాల్వ పెండింగ్ పనుల అంచనా ప్రతిపాదనలను, నృసింహసాగర్ ముంపు గ్రామాలైన లప్పానాయక్‌తండా, చొక్ల తండాలకు సంబంధించిన భూసేకరణకు, ఆర్ఆర్‌కు సంబంధించిన నిధులు అవసరమని అధికారులు ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకొచ్చారు. సమీక్షా సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎ.భాస్కరరావు, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి అమరేందర్, నీటిపారుదల శాఖ ఎస్ఈ శ్రీనివాస్, రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ శంకరయ్య, పంచాయతీరాజ్ ఈఈ వెంకటేశ్వర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు నాగలక్ష్మి, ఇంజినీరింగ్ శాఖల అధికారులు, తాసీల్దార్లు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు ఎపిక్ కార్డు తప్పనిసరి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, జనవరి 10 : వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదుకు ఫిబ్రవరి 6వ చివరి తేదీ అని, ఓటు నమోదు కోసం ఎపిక్ కార్డు తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ హనుమంత్ కె.జెండగే తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు, తాసీల్దార్లు, డిప్యూటీ తాసీల్దార్లకు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి వచ్చే ఫిబ్రవరి 6వ తేదీ ఓటరు నమోదుకు ఫారం 18 దాఖలు చేయడానికి చివరి తేదీ అని, ఎన్నికల నిర్వహణ పట్ల పూర్తి అవగాహన పొందాలని తెలిపారు. వచ్చే ఫిబ్రవరి 24న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తారని చెప్పారు. అందుకోసం వచ్చే ఫిబ్రవరి 24 నుంచి మార్చి 14 వరకు మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తారని, ఏప్రిల్ 4న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామని అన్నారు. మార్పులు, చేర్పుల కోసం తాసీల్దార్ కార్యాలయాలలో దరఖాస్తులు ఇవ్వవచ్చునని, లేదా ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ http://ceotserms2. telangana. gov.in/mlc/form18.aspxలో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఓటు నమోదు కోసం 2023 నవంబర్ నాటికి మూడు సంవత్సరాలు ముందుగా డిగ్రీ పూర్తి అయి ఉండాలని సూచించారు. ఓటు నమోదు కోసం ఎపిక్ కార్డు తప్పనిసరి అని, ఎపిక్ కార్డు ఏ నియోజకవర్గానికి సంబంధించి ఉంటే అదే నియోజక వర్గంలో ఓటు నమోదు చేసుకోవాలని, ఎపిక్ కార్డు వెంట ఆధార్ కార్డు, డిగ్రీ సర్టిఫికెట్ జిరాక్స్‌లు జత చేయాలని తెలిపారు. ఓటు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను బూత్ లెవల్ సూపర్‌వైజర్ డిజిగ్నేటెడ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, ప్రతి ఓటు నమోదు దరఖాస్తుకు ఒక ఫైల్ రూపొందించాలని చెప్పారు. పట్టభద్రుల ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండి జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎ.భాస్కర్‌రావు, మాస్టర్ ట్రైనర్ నర్సిరెడ్డి ఎన్నికల నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు.

గృహలక్ష్మి లబ్ధిదారులను కొనసాగించాలి

- కలెక్టరుకు వినతి పత్రం అందజేసిన బీఆర్ఎస్ నాయకులు

గృహలక్ష్మి లబ్ధిదారులతో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

భువనగిరి కలెక్టరేట్, జనవరి 10 : గత ప్రభుత్వం మంజూరు చేసిన గృహలక్ష్మి లబ్ధిదారులను కొనసాగించాలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక గృహలక్ష్మి పథకం లబ్ధిదారులను అయోమయంలో నెట్టి వేసిందని, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం లబ్ధిదారులతో కలిసి కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయాలనే సంకల్పంతో గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి లబ్ధిదారులను ఎంపిక చేసిందన్నారు. ఆ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించాలని చూస్తున్నదని, ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటు చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జడల అమరేందర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, జడ్పీటీసీ బీరు మల్లయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతల కృష్ణయ్య, వివిధ మండలాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జనగాం పాండు, పాటి సుధాకర్‌రెడ్డి, తుమ్మల వెంకట్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, కౌన్సిలర్ గోమారి సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, ఓం ప్రకాశ్, నాయకులు ఇట్టబోయిన గోపాల్, సూరపల్లి రమేశ్, అతికం లక్ష్మీనారాయణ గౌడ్, అబ్బగాని వెంకటేశ్, ర్యాకల శ్రీనివాస్, తాడూరు భిక్షపతి, తాడెం రాజశేఖర్, సుభాశ్, సహదేవ్, నరసింహ, శ్రీశైలం, శ్రీధర్, యువజన విభాగం అధ్యక్షులు పెంట నితీశ్, ప్రధాన కార్యదర్శి నాగారం సూరజ్, శివకుమార్, అజయ్, ఫజల్ ఉద్దీన్ పాల్గొన్నారు.

నెల రోజుల్లో 11.83 శాతమే

పంట పెట్టుబడి సాయంలో తీవ్ర జాప్యం

ఇప్పటి వరకు రైతులకు అందింది రూ. 147.38 కోట్లు మాత్రమే

- 11.06లక్షల మందికి గానూ 4.06 లక్షల మందికే లబ్ధి
- ఎదురు చూపుల్లో 7లక్షల మంది రైతులు
- ప్రభుత్వ తీరుపై రైతుల్లో అసహనం

నల్లగొండ ప్రతినిధి, జనవరి10 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు చెప్పిన మాటలకు అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ సర్కార్ చేతలకు పొంతన లేకుండా పోయింది. రైతుబంధు స్థానంలో రైతు భరోసా పేరుతో ఎకరాకు పెట్టుబడి సాయంగా రూ.7500 అందిస్తామని చెప్పి... తీరా అధికారంలోకి రాగానే ఈ సారికి గతంలో మాదిరిగానే రూ.5వేలతోనే సరి పెట్టుకోవాలని ప్రకటించింది. కొత్త సర్కార్ కదా అని రైతులు సరేలే అనుకున్నా... ఆ డబ్బుకు కూడా భరోసా లేకుండా పోయింది. నెల రోజుల వ్యవధిలో ఉమ్మడి జిల్లా పరిధిలో కేవలం రూ.147.38 కోట్లు మాత్రమే రైతుల ఖాతాలకు చేరింది. మొత్తం నగదులో ఇది 11.83శాతమే కావడం గమనార్హం. 11.06లక్షల మంది రైతులు ఉండగా నేటికీ 4.06లక్షల మందికే రైతు భరోసా డబ్బులు జమైనట్లు ప్రభుత్వ లెక్కలు వెల్లడిస్తున్నాయి. మిగతా ఏడు లక్షల మందికి నిత్యం ఎదురుచూపులు తప్పడం లేదు. యా సంగి సీజన్ ముగింపు దశకు వచ్చినా పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికలకు ముందుగానే యాసంగి రైతుబంధు డబ్బులను రైతులకు అందించాలని అప్పటి కేసీఆర్ సర్కార్ రంగం సిద్ధం చేస్తే కాంగ్రెస్ పార్టీ అడ్డుకున్న విషయం తెలిసిందే. పైగా తాము అధికారంలోకి వచ్చిన మర్నాడే ఎకరాకు 7,500 రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేస్తామంటూ రైతులను మభ్యపెట్టింది. అధికారంలోకైతే వచ్చింది... కానీ రైతు భరోసా మాత్రం పెంచలేదు. కేసీఆర్ సర్కార్ మాదిరిగానే ఈ సీజన్ వరకు 5వేల రూపాయలే ఇస్తామని ప్రకటించి గత నెల 10 నుంచి జమ చేస్తామని ఆర్భాటంగా ప్రకటించింది. కానీ ఆచరణలో మాత్రం అడుగు ముందుకు పడడం లేదు. వాస్తవంగా రోజుకో ఎకరం చొప్పున పెంచుతూ పక్షం రోజుల్లోనే గత కేసీఆర్ సర్కార్ రైతుబంధు నగదు జమలు పూర్తి చేసేది. కానీ బుధవారం నాటికి 30 రోజులు పూర్తైనా నేటికీ జమ చేయాల్సిన మొత్తం నగదులో కేవలం 11.83శాతమే రైతుల ఖాతాల్లో పడ్డాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 11.06లక్షల మంది రైతులకు గానూ రూ.1245 కోట్లు పెట్టుబడి సాయంగా అందాల్సి ఉంది. ఇందులో నెలరోజుల్లో కేవలం 4.06లక్షల మంది రైతులకు గానూ రూ.147.38కోట్లు మాత్రమే ఖాతాల్లో జమ చేశారు. ఇంకా 88.17శాతం నగదు జమ చేసే సరికి సీజన్ పూర్తై వానకాలం కూడా వస్తుందేమోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఎదురుచూపుల్లో 7లక్షల మంది

సరిగ్గా నెల రోజుల కిందట పెట్టుబడి సాయం అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించినా తీవ్ర జాప్యం జరుగుతున్నది. నిత్యం రైతులకు తమ మొబైల్స్‌లో మెసేజ్ కోసం చెక్ చేసుకోవడం లేదా నేరుగా బ్యాంకు ఖాతాలో బ్యాలెన్స్‌ను సరిచూసుకోవడమే సరిపోతుంది. కానీ ఎంతకూ రైతుభరోసా నగదు మాత్రం జమ కావడం లేదు. ఇలా నెల రోజులుగా రైతులు సతమతం అవుతున్నారు. ఆగిఆగి సాగుతున్న తీరుగా నేటికీ కేవలం 4.06లక్షల మంది రైతుల ఖాతాల్లో 147.38 కోట్లే జమయ్యాయి. జిల్లాల వారీగా పరిశీలిస్తే నల్లగొండ జిల్లాలో మొత్తం రైతులు 5.42లక్షల మంది కాగా 2.02లక్షల మంది ఖాతాల్లో రూ.624కోట్లకుగానూ రూ.77.47కోట్లు జమ అయ్యాయి. సూర్యాపేట జిల్లాలో మొత్తం 2.93లక్షల మంది రైతులకు గానూ 1.15లక్షల మంది ఖాతాల్లో రూ.317కోట్లకు రూ.44.06కోట్లు పడ్డాయి. ఇక యాదాద్రి జిల్లాలో మొత్తం 2.71 మంది రైతులకు గానూ 89వేల మంది రైతుల ఖాతాల్లో రూ.304 కోట్లకు 25.85కోట్ల నగదే జమ జరిగింది. దీంతో ఉమ్మడి జిల్లాలో ఇంకా 7లక్షల మంది రైతులు ఎదురుచూపులు చూస్తున్నారు. వీరికి గానూ మొత్తం రూ.1198కోట్ల పెట్టుబడి సాయం అందాల్సి ఉంది. నెల రోజుల్లో కేవలం 11.83శాతం నగదే రైతులకు చేరితే మిగతా 88.17శాతం ఎప్పుడు రైతుల ఖాతాల్లో జమ అవుతుందనేది సందేహాస్పదంగా మారింది. దీనిపై వ్యవసాయ అధికారుల వద్ద సైతం సరైన సమాధానం లేదు

నాడు ఎన్నడూ ఆగని సాయం...

కేసీఆర్ సర్కార్ హయాంలో 11 విడుతల్లో ఉమ్మడి జిల్లా రైతులకు రూ.11,700 కోట్ల రూపాయలు పెట్టుబడి సాయంగా అందింది. 2018 వానకాలం సీజన్ నుంచి రైతుబంధు పథకానికి శ్రీకారం చుట్టిన కేసీఆర్.. వరుసగా మొత్తం 11 సీజన్లల్లో క్రమం తప్పకుండా కచ్చితంగా అందజేస్తూ వచ్చారు. 2018 వానకాలం సీజన్ నుంచి ఎకరానికి నాలుగు వేల చొప్పున ఏడాదికి రెండుసార్లు పెట్టుబడి సాయం అందించడం మొదలు పెట్టారు. 2018 డిసెంబర్‌లో రెండోసారి అధికారంలోకి రాగానే వానకాలం నుంచి ఎకరానికి ఐదు వేల చొప్పున ఏడాదిలో రెండు సీజన్లకు కలిపి 10వేల రూపాయల సాయాన్ని అందిస్తూ వస్తున్నారు. అప్పటి నుంచి గత వానకాలం సీజన్ వరకు ఎన్నడూ రైతుబంధు ఆగలేదు. పైగా సీజన్ సీజన్‌కు కొత్తగా పాసు పుస్తకాలు పొందిన ప్రతి రైతుకు సైతం పెట్టుబడి సాయం అందజేస్తూ వచ్చారు. ఒక్కసారి పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లోకి జమ కావడం మొదలైతే... చివరి రైతుకు అందే వరకు ఆగేది కాదూ. పక్షం రోజుల్లోనే పట్టాదారు పాసు పుస్తకం ఉన్న ప్రతి రైతుకు రైతుబంధు పెట్టుబడి సాయం అందించిన ఘనత కేసీఆర్ సర్కార్‌దే.

జిల్లా	మొత్తం రైతులు	అందాల్సిన నగదు	అందిన రైతులు	అందిన నగదు
నల్లగొండ	5.42లక్షలు	624 కోట్లు	2.02లక్షలు	77.47కోట్లు
సూర్యాపేట	2.93లక్షలు	317 కోట్లు	1.15లక్షలు	44.06కోట్లు
యాదాద్రి	2.71లక్షలు	304 కోట్లు	0.89లక్షలు	25.85కోట్లు
మొత్తం	11.06లక్షలు	1245 కోట్లు	4.06లక్షలు	147.38కోట్లు